# ‘ఉపాధి’ లక్ష్యం..

- కూలీలకు 1,33,874 పని దినాలు
- గ్రామసభల ద్వారా పనులు గుర్తించిన అధికారులు
- అత్యధికంగా గునుకులకొండాపూర్‌లో 18,500, అత్యల్పంగా యాస్వాడలో 1457 పని దినాలు
- మండలంలోని మొత్తం కూలీలు 10,196 మంది



హన్మాజిపల్లెలో కందకాల తవ్వకంలో కూలీలు



గునుకులకొండాపూర్‌లో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

**గన్నేరువరం:** గ్రామాల్లో వలసలు నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ప్రవేశపెట్టింది. దానికి అనుగుణంగా కూలీలకు ఉపాధి కల్పించడానికి ఇటీవల గ్రామసభల ద్వారా చేపట్టే పనులను గుర్తించారు. గ్రామాల వారీగా పనులకు సంబంధించి పని దినాలను సైతం ఖరారు చేశారు. మండలంలో ఉన్న ఉపాధి కూలీలకు 1,33,874 పని దినాలను లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతానికి వరినాట్ల పనుల్లో కూలీలు బిజీగా ఉన్నారని, సంక్రాంతి తర్వాత పనులు తగ్గుముఖం పడతాయని అధికారులు తెలిపారు. అనంతరం పనుల కోసం కూలీల ద్వారా డిమాండ్ ఉంటుందన్నారు.

**పూర్తిగాని లక్ష్యం**

మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉండగా 10,196 మంది కూలీలుగా నమోదు చేసుకోగా ఇందులో ఏటా సగం మంది కూలీలు పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి 330 కుటుంబాల్లోని 4,695 మంది కూలీలకు 1,55,487 పనిదినాలు కల్పించారు. 2023–24లో రెండు లక్షల పనిదినాలను టార్గెట్‌గా పెట్టుకోగా 1,04,000 పని దినాలు కల్పించామని అధికారులు తెలిపారు. దీంతో లక్ష్యానికి చాలా మంది దూరంగా నిలిచిపోయారు. చెరువులు, కాల్వల్లో పూడికతీత, కందకాలు తవ్వడం, హరితహారంలో అవెన్యూ, కమ్యూనిటి, మిడ్ మానేరు డ్యాం వరద కాల్వలకు ఇరుపక్కల మొక్కలు నాటడం వంటి పనులను చేపట్టారు. 2022, 2023 మార్చి, ఏప్రిల్, మేలో అత్యధికంగా రోజుకు మూడు వేల మంది కూలీలకు పనులను కల్పించారు.

**చేపట్టే పనులు...**

1. మట్టి రోడ్ల నిర్మాణంతో పాటు గతంలో చేపట్టిన రోడ్ల మరమ్మతు
2. మట్టి కాల్వలు తవ్వకాలతో పాటు మరమ్మతు
3. కమ్యూనిటీ భూముల్లో మట్టి కట్టల నిర్మాణాలు
4. వర్షపు నీరు నిల్వ చేయడానికి గుంతల తవ్వకం
5. గ్రావెల్ బేస్‌రోడ్ల నిర్మాణాలు మరమ్మతు
6. కమ్యూనిటీ భూముల్లో చేపల చెరువుల తవ్వకం
7. రైతుల భూముల్లో పాంపాండ్ తవ్వకం
8. చెరువుల్లో పూడికతీత పనులు

| గ్రామం | కూలీలు | పనిదానాలు |
|---|---|---|
| చాకవాలివానిపల్లె | 367 | 4,937 |
| చీమలకుంటపల్లె | 332 | 8,377 |
| చొక్కారావుపల్లె | 377 | 4,224 |
| గన్నేరువరం | 2871 | 15,000 |
| గోపాల్‌పూర్ | 191 | 4698 |
| గుండ్లపల్లి | 447 | 7,500 |
| గునుకులకొండాపూర్ | 922 | 18,500 |
| హన్మాజిపల్లె | 568 | 10,750 |
| జంగపల్లి | 1104 | 14,800 |
| ఖాసీంపేట | 578 | 10,250 |
| మాదాపూర్ | 554 | 9,430 |
| మైలారం | 709 | 10,303 |
| పారువెల్ల | 467 | 7,334 |
| పీచుపల్లి | 193 | 3,377 |
| సాంబయ్యపల్లె | 153 | 2,937 |
| యాస్వాడ | 163 | 1,457 |

## కూలీలకు ఉపాధి



జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ప్రతి కూలీకి పని స్థానికంగా దొరుకుంది. వేసవిలో వ్యవసాయ పనులు తక్కువ ఉండటంతో ఈ సమయంలో కూలీ పని ఇబ్బందిగా ఉంటుంది. దీంతో ఉపాధిహామీ పథకంలో పనికి డిమాండ్ చేసుకున్న ప్రతి కూలీకి పనులు కల్పిస్తున్నారు.

– అమ్మిగల్ల లక్ష్మి, కూలీ హన్మాజిపల్లె

## లక్ష్యానికి అనుగుణంగా..



లక్ష్యానికి అనుగుణంగా కూలీలకు పనులను కల్పించడానికి 1,33,874 పని దినాలకు గ్రామసభల ద్వారా ఇప్పటికే గుర్తించాం. మండలంలో దాదాపు ఎనిమిది రకాల పనులను గుర్తించాం, వీటితో పాటు వననర్సరీ వంటి పనులు చేపట్టడం జరుగుతోంది. ప్రతి కూలీకి పని కల్పించడమే లక్ష్యం.

– స్వాతి, ఎంపీడీవో గన్నేరువరం

## ఇంటింటికీ రాములోరి అక్షింతలు



తిమ్మాపూర్: రాములోరి అక్షింతలు పంపిణీ



వీణవంక: బేతిగల్‌లో రాములోరి

**హుజూరాబాద్:** అయోధ్య దేవాలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఇంటికి రాములోరి అక్షింతలు పంపిణీ చేశారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల సభ్యులకు, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సల్వాది సమ్మయ్య తదితరులకు అక్షింతలు పంపిణీ చేశారు.

**వీణవంక:** మండలంలోని బేతిగల్ గ్రామంలో అయోధ్య రాములోరి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. గ్రామ వీధుల్లో ఊరేగింపుకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మోరె స్వామి, ఉపసర్పంచ్ చొప్పరి తిరుపతి, చొప్పరి సారయ్య, కొక్కిరాల నారాయణరావు, తక్కలపల్లి సంపత్‌రావు, దెంచనాది రాజగోపాలచారి, జీడిపల్లి రాజేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ గొట్టిముక్కల సంపత్‌రావు, చిలివేరు గణపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

**తిమ్మాపూర్:** అయోధ్య శ్రీ రాముని తలంబ్రాలు బుధవారం మండల కేంద్రంలోని శ్రీహోమ్స్ కాలనీ, పోలీస్ క్వార్టర్స్ సమీపంలోని ఇండ్లలోకి చేరాయి. స్థానికులు మేళ తాళాలతో స్వాగతం పలికారు. శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ అయోధ్య శ్రీ రాముని ఆలయంలో జనవరి 22న విగ్రహ ప్రాణప్రతిష్ఠ దృష్ట్యా అయోధ్య శ్రీరాముని పాదాల చెంత పూజించబడిన తలంబ్రాలు గ్రామంలోని గడగడపకు 15 వరకు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రామ భక్తులు కేతిరెడ్డి అంజిరెడ్డి, రామిడి మల్లారెడ్డి, బోయిని ఆంజనేయులు, సంధి శ్రీనివాస్, పోరెడ్డి రవీందర్ రెడ్డి, రజిత, నర్సింహారెడ్డి, అనిత భజన మండలి, సేవాదళ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

**శబరిమలలో మండల అయ్యప్పస్వాములు**

**రామడుగు:** మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన పలువురు అయ్యప్పస్వాములు బుధవారం అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లారు. ఈ సందర్భంగా పంబ నది వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడితో దైవదర్శనానికి వెళ్లారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

**చిగురుమామిడి:** రాబోయే ఆర్థిక సంవత్సరంలో విద్యకు 14 శాతం నిధులు కేటాయించాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కానిగంటి రాజమౌళి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం చిగురుమామిడి ప్రాథమిక పాఠశాలలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ –2024 క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, స్కావెంజర్లు లేక మూత్రశాలలు, మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయని, ఎన్నికల సమయంలో చెప్పినట్లుగా ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. క్యాలెండర్ ఆవిష్కరణలో జిల్లా సెక్టోరల్ అధికారి కర్ర అశోక్‌రెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వి. పావని, డీటీఎఫ్ మండల బాధ్యులు కరుణాకర్, శివరాం, మునిప్రసాద్, సుజాత, పుష్పలత, స్వరూప, బి.సత్యనారాయణ పలువురు ఉన్నారు.

**జమ్మికుంట:** మండలంలోని కోరపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో డీటీఎఫ్( డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) జిల్లా ఉపాధ్యక్షుడు నరహరి, జిల్లా కార్యదర్శి ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో ప్రవేశపెట్టిన ఉన్నతి కార్యక్రమం అశాస్త్రీయంగా ఉందని, విద్యా వ్యవస్థ కుంటుపడుతుందని, ఉపాధ్యాయులకు అదనపు భారం పడుతుందని కార్యక్రమాన్ని ప్రభుత్వం సమీక్షించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు సత్వరమే చెల్లించాలని, ప్రమోషన్లు ఇవ్వాలని, న్యాయపరమైన సమస్యలు రాకుండా డీఎస్సీ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సదానందం, సమ్మయ్య, సదయ్య, రాజిరెడ్డి, సదానందరం, సురేశ్, ప్రకాశ్, టీచర్లు పాల్గొన్నారు.



సుందరగిరి ప్రాథమిక పాఠశాలలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం బాధ్యులు

## క్లుప్తంగా

## క్రీడలతో మానసికోల్లాసం

### ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



టీషర్టులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

**తిమ్మాపూర్:** క్రీడలు మానసిక ఉల్లాసం, స్నేహభావం పెంపొందిస్తాయని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలం రేణికుంటలో మానకొండూరు నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు క్రీడల్లో పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, యువతకు ఎందులో ఆసక్తి ఉంటే అందులో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. 30 మంది క్రీడాకారులకు టీషర్టులను గ్రామానికి చెందిన కొర్రి వంశీ, మహేశ్ ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పనుల పరిశీలన

**గన్నేరువరం:** మండలంలోని ఖాసీంపేట గ్రామంలో చేపట్టిన 2ఆర్ సబ్ మైనర్ కాల్వ మరమ్మతు పనులను ఎంపీపీ లింగాల మల్లారెడ్డి బుధవారం పరిశీలించారు. మిడ్ మానేరు ప్రాజెక్టు కుడికాల్వ నుంచి ఉపకాల్వ 8కి సాగునీరు సరఫరా జరుగుతోంది. ఇక్కడి నుంచి 2ఆర్ సబ్ మైనర్ కాల్వకు నీరు సరఫరా కావడం లేదని దీంతో కాల్వ కింది రైతులు ఇబ్బందులు పడుతుండటంతో సంబంధిత అధికారులు పనులు చేపట్టారని తెలిపారు. పనుల పూర్తయిన తర్వాత సాగునీరు విడుదల చేస్తామన్నారు. కాల్వల మరమ్మతు పనులు వేసవి కాల్వలో చేపట్టాలని రైతులు అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి, సర్పంచ్ ముస్కు కరుణాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ బద్దం సంపత్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, ఏలేటి సతీశ్‌రెడ్డి, బద్దం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## చెక్కు అందజేత

**మానకొండూర్:** బ్యాంకులు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ ఎస్‌బీఐ మేనేజర్ చంద్రశేఖర్ కోరారు. ఈదులగట్టెపల్లి గ్రామానికి చెందిన సీడ్ ఆర్గనైజర్ దాంసాని అశోక్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ప్రమాద బీమా కింద రూ.పది లక్షల చెక్కును మృతుడి భార్య నిరోషాకి బుధవారం అందజేశారు. బ్యాంకులు అందిస్తున్న ఇన్సూరెన్సు సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలని, ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉంటుందన్నారు. ప్రతీ ఒక్కరు ఇన్సూరెన్సు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ కె. రవి శంకర్, ఎ.ఎం కిరణ్‌కుమార్, ఎ.డి.ఎం రాజేశం, సబార్డినేటర్ కుంచాల మహేశ్, బెడద సుదాకర్, పాల్గొన్నారు.

## దుకాణాల తనిఖీ

**గన్నేరువరం:** మండలంలోని గన్నేరువరం, హన్మాజిపల్లె, ఖాసీంపేట, గుండ్లపల్లి గ్రామాల్లోని పెస్టిసైడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ షాపులను బుధవారం వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, పురుగు మందుల అమ్మకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. స్టాకు వివరాలను తెలుసుకున్నారు. ఆయా షాపులకు అవసరమైన ఎరువుల డిమాండ్ వివరాలు నమోదు చేసుకున్నారు. వెంట ఏఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.

## బాలల పరిరక్షణ కమిటీ

**గన్నేరువరం:** గన్నేరువరం గ్రామ పంచాయతీ బాలల పరిరక్షణ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా గ్రామ సర్పంచ్ లక్ష్మీ, సభ్యులుగా ఉప సర్పంచ్ బూర వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు బొడ్డు పుష్పలత, న్యాత స్వప్న, గ్రామ కార్యదర్శి వెంకటేశ్‌తో పాటు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు నియామకమయ్యారు.

## ఆర్థిక సాయం

**జమ్మికుంట:** మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన కుక్కల మల్లేశ్ ఇటీవల మృతిచెందాడు. మృతుడి స్నేహితులు 2003–04 పదో తరగతి విద్యార్థులు బుధవారం మల్లేశ్ కుటుంబానికి రూ.30,500 అందించారు. శ్రీకాంత్, మహేందర్, వినోద్, రాజేందర్, తాళ్లపెల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

**వీణవంక:** మండలంలోని నర్సింగాపూర్ లో ఉయ్యాల లక్ష్మయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మృతుడి పదో తరగతి స్నేహితులు బుధవారం లక్ష్మయ్య కుటుంబ సభ్యులకు రూ.20వేలు అందించారు. ఎండీ రజాక్, ఉయ్యాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

**బియ్యం అందజేత**

**హుజూరాబాద్:** పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ బొప్పరాజు సంతోష్ తల్లి అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు యాభై కిలోల బియ్యం, నగదు అందజేశారు.

## విద్యార్థుల క్షేత్ర సందర్శన

**సైదాపూర్:** మండలంలోని సోమారం ఆదర్శ పాఠశాల విద్యార్థులు బుధవారం క్షేత్ర సందర్శనలో భాగంగా గ్రామ శివారులోని పొలాల్లో వరినాట్లు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫర్హానా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం

**చొప్పదండి:** పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను హెచ్‌ఎం వైద్యుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ, వైస్ చైర్ పర్సన్ సాంబయ్య కార్యక్రమానికి హాజరయ్యారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కరుణ, సుమలత, దేవలక్ష్మిని శాలువా, మెమెంటోలతో సత్కరించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో జలపతి, జలీల్, పుష్పలత, సత్యనారాయణ, శారద, సుధారాణి, వీరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**స్కూల్ కాంప్లెక్స్ సమావేశం**

**గంగాధర:** మండలంలోని ఉప్పరమల్యాల ఉన్నత పాఠశాలలో బుధవారం సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. గంగాధరతో పాటు రామడుగు మండలంలోని సోషల్ టీచర్లు పాల్గొన్నారు. టీపీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అన్నమనేని తిరుపతిరావును ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభావతి, మండల నోడల్ ఆఫీసర్ ఏనుగు ప్రభాకర్‌రావు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి అవధూత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**ట్రస్మా అధ్యక్షుడిగా జగన్మోహన్‌గౌడ్**

**రామడుగు:** ట్రస్మా రామడుగు మండల అధ్యక్షుడిగా విన్నర్స్ పాఠశాల చైర్మన్ పంజాల జగన్మోహన్ గౌడ్‌ను సభ్యులు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా మినుకుల మునీందర్, కోశాధికారిగా తోట కిరణ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శేఖర్‌రావు, జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి పాల్గొన్నారు. గెలుపొందిన పాలక వర్గాన్ని సభ్యులు రాధాక్రిష్ణ, రాజశేఖర్‌గౌడ్, ఉప్పు శ్రీనివాస్ అభినందించారు.

**ఎఫ్ఎల్‌ను రద్దుచేయాలి**

**శంకరపట్నం:** మండలంలోని తాడికల్‌లో బుధవారం ఉపాధ్యాయుల స్కూల్‌కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్‌ను రద్దుచేయాలని కోరుతూ ఎంఈఓ వెంకటనర్సింహారెడ్డికి, ఎంఎన్ఓ లక్ష్మీనారాయణ, స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణుకుమార్‌లకు ఉపాధ్యాయులు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, హరికిషన్, ఖాద్రి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నియామకం



ఎన్నికైన నూతన కార్యవర్గం

**తిమ్మాపూర్:** టీఎన్‌జీవోస్ తిమ్మాపూర్, గన్నేరువరం యూనిట్ ఎన్నికలు బుధవారం నిర్వహించారు. ఈమేరకు నిర్వహించిన సమావేశంలో యూనియన్ అధ్యక్షుడిగా పోలు కిషన్, కార్యదర్శిగా అంబటి నాగరాజు, కోశాధికారిగా పుప్పాల అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బి.రాజయ్య, డి.ధనలక్ష్మి, వి.వెంకటరెడ్డి, బి.రాజ్ కుమార్, యం.యుగంధర్ రెడ్డి, ఎన్.రవీందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా పి.శ్రీనివాస్, శేశంక్, పి.లక్ష్మణ్, రాజ్ కుమార్,ఎస్.రాజ్ కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఏ .లచ్చయ్య, బి.శ్రీనివాస్, సరస్వతి, సంతోష్, ప్రచార కార్యదర్శిగా వి.పవిత్ర,కార్యవర్గ సభ్యులుగా కె.లావణ్య, శ్వేత, కుమార స్వామి, శ్రీనివాస్, రమేశ్, మహేందర్, రవీంద్ర స్వామి, మతిన్, నాగరాజు, రాజమల్లును ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఎన్నిక పూర్తిగా ఏకగ్రీవంగా జరిగిందని ఎన్నికల అధికారి జిల్లా టీఎన్జీవోస్ కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ రాజేశ్, కరీంనగర్ రూరల్ అధ్యక్షుడు భరద్వాజ్ తెలిపారు. ఎన్నికకు సహకరించిన కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, రాష్ట్ర నాయకులు హరికృష్ణ, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సహాయ అధ్యక్షుడు రాగి శ్రీను, జిల్లా కార్యవర్గ సభ్యులు రవీందర్ రెడ్డి, జి.రమేశ్, వి.ప్రసాద్, రాఘవ రెడ్డి, మన్నే సరిత, పవన్ కుమార్, కె.శ్రీనివాస్, అజహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## కారోబార్ నిరసన

**హుజూరాబాద్‌రూరల్:** మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామ పంచాయతీ కారోబార్ నలుబాల సందయ్య బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపాడు. ఏళ్లుగా కారోబార్‌గా విధులు నిర్వహిస్తుండగా ఐదు నెలల కిత్రం ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఆన్‌లైన్ నుంచి పేరును తొలగించారని, పంచాయతీ కార్యదర్శి హాజరు రిజిష్టరులో పేరు సైతం తొలగించారని, రూ.75 వేల వేతనం, ఇంకా ఐదేళ్ల సర్వీసు ఉందని తెలిపారు. ఈ విషయంపై విచారణ జరిపి ఉద్యోగంలోకి తీసుకొని వేతనం వెంటనే మంజూరు చేయాలని ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించాడు.

## మద్యం పట్టివేత

**సైదాపూర్:** మండలంలోని వెన్నంపల్లి, రాయికల్ గ్రామాల్లో సైదాపూర్ పోలీసులు బుధవారం మద్యం పట్టుకున్నారు. సైదాపూర్ ఎస్ఐ ఆరోగ్యం తెలిపిన వివరాలు... వెన్నంపల్లిలో రూ.2,580, రాయికల్‌లో రూ.9800 విలువైన మద్యం స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని, మద్యం విక్రయిస్తున్న వారిపై కేస్ నమోదు చేశామన్నారు. మండలంలో ఎక్కడైనా అక్రమంగా బెల్టుషాపులు నిర్వహించినా, బహిరంగ ప్రదేశాల్లో మద్య సేవించినా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

**ఇసుక అక్రమ రవాణాదారులపై కేసు**

**కరీంనగర్ క్రైం:** మానకొండూర్ మండలంలోని శ్రీనివాస్‌నగర్ వాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

**రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు**

**శంకరపట్నం:** మండలంలోని గొల్లపల్లె గ్రామ శివారులో బుధవారం రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కొత్తగట్టుకు చెందిన కామిడి సాంబశివారెడ్డి బైక్‌పైవెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని స్థానికులు కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

## ఎమ్మెల్యే పరామర్శ

**చొప్పదండి:** చొప్పదండి మండలంలోని పలు కుటుంబాలను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. రుక్మాపూర్ గ్రామంలో గన్మెన్ రాజు కుటుంబాన్ని , కొలిమికుంటలో ఒక కుటుంబాన్ని, చొప్పదండి చెందిన ఎల్లారెడ్డి తండ్రి మృతి చెందగ, వారి కుటుంబాన్ని గంధం సుమన్ తండ్రి మృతి చెందగ వారి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపాల్ చైర్మన్ నీరజ, జిల్లా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు సంక్రాంతి వేడుకలు



రామడుగు: వేడుకల్లో విద్యార్థులు



జమ్మికుంట: వేషధారణల్లో చిన్నారులు

**జమ్మికుంట:** పట్టణంలోని న్యూ మిలీనియం ప్లే స్కూల్‌లో బుధవారం ముందస్తు సంక్రాంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హరిదాసు, గోదాదేవి వేషధారణలో ఆకట్టుకున్నారు. భోగి మంటలు, సంక్రాంతి పండుగ విశేషాలు, చదువుతోపాటు సాంప్రదాయాలు, పండుగలపై పిల్లలకు అవగాహన ఉండాలని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ముసిపట్ల తిరుపతిరెడ్డి, ప్రిన్సిపల్ వరణ్‌రెడ్డి, టీచర్లు లావణ్య, స్వప్న, శ్రీలత,హైమావతి, దివ్య తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

**రామడుగు:** మండల కేంద్రంలోని విన్నర్స్ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు, కనుమ, భోగి మంటలు, పిండి వంటలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. పోటీలలో విజేతలకు సర్పంచ్ పంజాల ప్రమీల బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జగన్మోహన్‌గౌడ్, హెచ్‌ఎం గజ్జెల నర్సయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- **కేసు నమోదు**

**జమ్మికుంట:** కోళ్లకు విషం పెట్టి చంపాడనే ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామని పట్టణ సీఐ బార్పటి రమేశ్ తెలిపారు. మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళలకు చెందిన 15 కోళ్లకు పాత కక్షలు మనస్సులో పెట్టుకొని ఓవ్యక్తి విషం పెట్టి చంపాడని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

- **చర్యలు తీసుకోవాలి**

**ఇల్లందకుంట:** మండల కేంద్రంలోని సిరిసేడు, భోగంపాడు గ్రామాల పల్లె ప్రకృతి వనాలను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడాన్ని కాంగ్రెస్ నాయకులు ఖండించారు. సంబంధిత అధికారులు దర్యాప్తు జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మూడు రోజులుకావస్తున్న సర్పంచులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు సంబంధం లేనట్టుగా వ్యవహరించడం బాధాకరమ న్నారు. కార్యక్రమంలో ఇల్లందకుంట మైనారిటీ సెల్ అధ్యక్షులు అజ్గర్, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, భోగంశ్యామ్, నరేందర్, రేణుకుంట్ల సారయ్య, మర్రి సాయి, రేణుకుంట్ల రాజు పాల్గొన్నారు.

## పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న ప్రఫుల్‌దేశాయ్

**మానకొండూర్‌రూరల్:** విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ అన్నారు. మండలంలోని శ్రీనివాస్‌నగర్ కేజీబీవీలో బుధవారం స్నేహితపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

**చొప్పదండి:** పట్టణంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో స్నేహితపై ఐసీడీఎస్, పోలీస్, వైద్య, వివిధ అధికారులు అవగాహన కలిగించారు.

**జమ్మికుంట:** పాఠశాల, కళాశాలల్లో చదివే ఆడపిల్లలకు స్నేహిత చక్కటి రక్షణ కవచమని ఎంఈవో విడుపు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని బాలికల, బాలుర పాఠశాలల్లో స్నేహిత అవగాహన సదస్సులు నిర్వహించారు.

**రామడుగు:** మండలంలోని వెదిర గ్రామ పరిధిలో ఉన్న కేజీబీవీలో స్నేహిత కార్యక్రమంలో భాగంగా సురక్షిత బాల్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి, జయప్రద హాజరై మాట్లాడారు.

**ఇల్లందకుంట:** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కేజీబీవీ ప్రత్యేక అధికారిని బాసబత్తిని రమాదేవి అన్నారు. మండలంలోని శ్రీరాములపల్లి కేజీబీవీలో స్నేహిత కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## సద్వినియోగం చేసుకోవాలి

**చిగురుమామిడి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వికసిత్ భారత్ సంకల్పయాత్ర రాష్ట్ర నోడల్ అధికారి దీక్షిత్ కోరారు. బుధవారం మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజల అభిప్రాయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు రీజినల్ మేనేజర్ అపర్ణరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు చిగురుమామిడి యూనియన్ బ్యాంకు మేనేజర్ అశోక్, సర్పంచ్ మమత, డాక్టర్ కార్తిక్, ఆరోగ్య మిత్ర రమేశ్, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఇల్లందకుంట:** కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా బుధవారం మండలంలోని వంతడ్పుల గ్రామంలో తిరుపతిరెడ్డి, బ్యాంక్ నోడల్ ఆఫీసర్ మంగీలాల్‌తో కలిసి ప్రత్యేక క్యాలెండర్ ఆవిష్కరించారు. దేశంలోని మారుమూల గ్రామాల్లో మార్పు తీసుకురావడం, కేంద్ర సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం కల్పించడమే లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని మోదీ ప్రభుత్వం చేపట్టిందని తిరుపతిరెడ్డి అన్నారు. మండల ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, శ్రీకాంత్, కిషన్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, మహేందర్, ఇల్లందకుంట మెడికల్ ఆఫీసర్ తులసిదాస్, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఏఈఓ రాకేశ్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## వీవీఆర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న నాయకులు

**రామడుగు:** రామడుగు సింగిల్ విండో చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు జన్మదినం పురస్కరించుకొని మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు. మండల అధ్యక్షుడు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, తవుటు మురళీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు మామిడి తిరుపతి, గంట్ల వెంకట్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు బండ అజయ్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మండలంలోని వెలిచాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బీఆర్ఎస్ నాయకులు దావు సుధాకర్, దైవాల రమణ ఆధ్వర్యంలో స్టడీ, ఎగ్జామ్ మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.